
సాక్షి
ఖమ్మం
ఆదివారం । 28 । మే । 2023



రామాలయంలో అక్రమాల పర్వం
భద్రాచలంలోని రామాలయంలో కొందరు ఉద్యోగులు, సిబ్బంది అక్రమాలు ఒక్కటొక్కటి బయటపడుతున్నాయి. 8లో



ఈత నేర్చుకునేందుకు వెళ్లి..
పండుగ నిమిత్తం స్వగ్రామానికి వచ్చిన బాలుడు స్నేహితులతో కలిసి బావి వద్దకు వెళ్లి నీట మునిగి మృతి చెందాడు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
43°/ 26°

వాతావరణం
జిల్లా అంతటా ఆదివారం గరిష్ఠస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం నుంచి వడగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

శ్రీవారికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. నిత్యపూజలతో పాటు ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను అలంకరించి అర్చకులు కురవి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యాన నిత్యకల్యాణం జరిపించగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల భక్తులు దర్శించుకున్నారు. అలాగే, పల్లకీ సేవ జరిపించారు. ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఐసెట్

ఖమ్మం సహకారనగర్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు రెండు రోజుల పాటు నిర్వహించిన ఐసెట్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. రెండో రోజైన శనివారం ఉదయం పరీక్షకు 494మందిలో 454మంది, మధ్యాహ్నం పరీక్షకు 494మందిలో 457మంది హాజరయ్యారని ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి.వరలక్ష్మి తెలిపారు.

కొనసాగుతున్న వెబ్ ఆప్షన్ల నమోదు



హెల్ప్‌లైన్ సెంటర్‌లో విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: 2023–24వ విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రవేశాలకు నిర్వహిస్తున్న దోస్త్ రిజిస్ట్రేషన్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా సూచించారు. మొదటి విడత వెబ్ ఆప్షన్ల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఈమేరకు విద్యార్థులు తమ కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు.

డీసీసీ కార్యాలయంలో నెహ్రూ వర్ధంతి



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక పార్టీ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ మాట్లాడారు. దేశ ప్రజానీకానికి ఎనలేని సేవలదించిన నెహ్రూ స్ఫూర్తిగా అందరూ తీసుకొని ముందుకు సాగాలని కోరారు. కాగా, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన దుర్గాప్రసాద్‌ను నాయకులు సన్మానించారు. ఈకార్యక్రమంలో నాయకులు పులిపాటి వెంకటయ్య, పుచ్చకాయల వీరభద్రం, మద్దినేని రమేష్, లకావత్ సైదులు, మలీదు వెంకటేశ్వర్లు, మద్ది వీరారెడ్డి, ఏలూరి రవి కుమార్, భూక్యా బాలాజీనాయక్ పాల్గొన్నారు.

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వారాంతపు సెలవులు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆర్జిత సేవల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

4న జ్యేష్ఠాభిషేక పూజలు

జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా జూన్ 4న రామాలయంలో జ్యేష్ఠాభిషేకోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఈఓ రమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి నిత్యకల్యాణం, తిరువీధి సేవ, పవళింపు సేవలు రద్దు చేస్తున్నట్లు వివరించారు.

ఖిల్లాపై కాషాయ జెండా ఎగరేస్తాం..



సభలో మాట్లాడుతున్న బండి సంజయ్, పక్కన పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు

- సీతారామ ప్రాజెక్టులోకి గోదావరి జలాలు వచ్చేదెన్నడు?
- భద్రాచలానికి కేసీఆర్ తలంబ్రాలు ఎందుకు తీసుకురావడం లేదు..
- లీకేజీలపై విచారణకు అభ్యంతరమేమిటో చెప్పాలి..
- నిరుద్యోగ మార్చ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంజయ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం వస్తే సాయిగణేష్ గుర్తుకువస్తాడు.. ఇక్కడ ఫైట్ చేస్తున్న కాషాయ కార్యకర్తలకు నా సెల్యూట్.. ఖమ్మంలో బీజేపీ ఎక్కడ ఉందని వాగిన నేతలు నిరుద్యోగ మార్చ్‌కు వచ్చిన వారిని చూడాలి.. ఇదే స్ఫూర్తితో ఖమ్మం ఖిల్లాపై వచ్చే ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేస్తాం.. అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ వెల్లడించారు. ఖమ్మంలో ఆ పార్టీ ఆధ్వర్యన శనివారం నిరుద్యోగ మార్చ్ నిర్వహించారు. జెడ్పీ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలు చల్లి నివాళులర్పించాక పాత బస్టాండ్ వరకు ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సంజయ్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో కాషాయ జెండా ఎగరేసి తీరుతామన్నారు. ఖమ్మం ఉద్యమాల ఖిల్లా, చైతన్యవంతమైన జిల్లా అని అన్నారు. కేసీఆర్ కుటుంబంతో తెలంగాణ రాలేదని, ఆయన ఖమ్మంలో దొంగ దీక్ష చేశాడని మండిపడ్డారు. అప్పట్లో ఎంపీ సుష్మాస్వరాజ్ మద్దతు తెలపడం, 1,400 మంది యువత బలిదానంతోనే తెలంగాణ వచ్చిందని చెప్పారు. కేసీఆర్ బిడ్డ లిక్కర్ దందా కోసం నిధులు ఉంటాయి కానీ ఖమ్మం జిల్లాతోపాటు తెలంగాణ ప్రజలకు లబ్ధి జరిగేలా పథకాల అమలుకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టులోకి గోదావరి జలాలు ఇంకా ఎందుకు రావడం లేదు, సీఎం కేసీఆర్ భద్రాద్రి రాముడికి తలంబ్రాలు ఎందుకు తీసుకురావడం లేదు, భద్రాద్రి అభివృద్ధి కోసం రూ.100 కోట్లు ఇస్తామన్న హామీ ఏమైందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏదేమైనా ఐదు నెలల్లో రామరాజ్యం వస్తుందని, అప్పటివరకు యువత ఓపిక పట్టాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అడ్రస్ ఎప్పుడో గల్లంతైందని, ఆ పార్టీ ఎక్కడ పోటీ చేసినా డిపాజిట్లు కూడా రావడం లేదని ఎద్దేవా చేశారు. ఏ ఎన్నికలు వచ్చినా బీజేపీ ఓటింగ్ శాతం పెరుగుతోందే తప్ప తగ్గడం లేదన్నారు. బీజేపీ దెబ్బకు తానే నికార్సయిన హిందువునని కేసీఆర్ ప్రకటించుకుంటున్నా జనం నమ్మడం లేదని బండి సంజయ్ చెప్పారు.



మీ కుటుంబానికే ఉద్యోగాలు..

నిరుద్యోగుల కోసం పోరాడుతోంది.. లాఠీ దెబ్బలు తింటోంది, జైలుకు పోతోంది బీజేపీ నేతలేనని సంజయ్ తెలిపారు. కేసీఆర్ కుమారుడు, అల్లుడు రెండుసార్లు మంత్రులయ్యారని, బిడ్డ ఓడినా ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని, మరి నిరుద్యోగులు ఏం పాపం చేశారని వారి ఉసురు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడానికి అభ్యంతరాలు ఏంటో చెప్పాలన్నారు. నిరుద్యోగుల తరఫున పోరాడుతున్న తనను పదో తరగతి పేపర్ లీకేజీ పేరుతో జైలుకు పంపారని, అయినా భయపడేది లేదని, చావడానికైనా సిద్ధమేనని చెప్పారు. ప్రధాని మోదీ శిష్యుడిని, అమిత్‌షా, నడ్డా అభిమానైన తాను ప్రజల కోసం ఎందాకైనా పోరాడుతానన్నారు. అధికారాలు ఇవ్వకుండా స్థానిక ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా కేసీఆర్ మార్చారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంచాయతీలకు అధికారాలు ఇవ్వడంతోపాటు కేంద్రంతో మాట్లాడి నిధులు తీసుకొచ్చి వాటిని బలోపేతం చేస్తామని సంజయ్ తెలిపారు.

ఫ్లెక్సీల్లో కనిపించని ఈటల

బీజేపీ ఆధ్వర్యాన ఖమ్మంలో నిర్వహించిన నిరుద్యోగ మార్చ్ కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, కటౌట్లలో ఆ పార్టీ చేరికల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఫొటో కనిపించలేదు. ఉద్దేశపూర్వకంగానే తమ నేత ఫొటోలు పెట్టలేదని ఆయన అనుచరులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటీవల ఈటల నేతృత్వంలోని చేరికల కమిటీ ఖమ్మం వచ్చింది. అప్పుడు జిల్లా కమిటీకి సమాచారం ఇవ్వలేదని ప్రచారం జరిగింది. తాజాగా నిరుద్యోగ మార్చ్‌లో ఈటల ఫొటో లేకపోవడంపై అనుచర నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, పార్టీ తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ రవీంద్రనాయక్, మాజీ ఎమ్మెల్యేలు సంకినేని వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎస్‌వీఎస్‌ఎస్.ప్రభాకర్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో పాటు నాయకులు, ప్రజాప్రతినిధులు కాసం వెంకటేశ్వర్లు, బండారి శాంతికుమార్, దేవకి వాసుదేవరావు, నంబూరి రామలింగేశ్వరరావు, అల్లిక అంజయ్య, రుద్ర ప్రదీప్, నున్నా రవికుమార్, శ్యాం రాథోడ్, దొంగల సత్యనారాయణ, దొడ్డా అరుణ, రాకేష్‌రెడ్డి, సంగప్ప, దరువు ఎల్లన్న, పుల్లారావు, ఉప్పల శారద, కోనేరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పాత బస్టాండ్ వద్ద జరిగిన సభకు హాజరైన బీజేపీ శ్రేణులు

నిప్పుల కొలిమి





బోసిపోయి కనిపిస్తున్న ఖమ్మంలోని పాత కలెక్టరేట్ రహదారి (ఇన్‌సెట్) వడగాలి బారిన పడకుండా రక్షణ చర్యలతో బైక్‌పై వెళ్తున్న జనం

వడగాలులతో ప్రజల విలవిల

- ఉదయం నుంచే గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు
- ముదిగొండ మండలం బాణాపురంలో 45 డిగ్రీలు నమోదు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: సూర్యప్రతాపంతో జిల్లా ఉడికిపోతోంది. తీవ్రమైన ఎండలతో ప్రజలు తారెత్తుతున్నారు. గత మూడు, నాలుగు రోజులుగా జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా వేడిగాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. శనివారం ముదిగొండ మండలం బాణాపురంలో అత్యధికంగా 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసినా.. వెంటనే ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతుండడంతో ప్రజలు అల్లాడుతున్నారు.

ఈ ఏడాది అత్యధికం

గతంతో పోలిస్తే ఈ ఏడాది భానుడి ప్రతాపం అధికంగానే ఉంది. ఏప్రిల్ వరకు వాతావరణం కొంత ఊరట కలిగించినా.. ఈనెల ప్రారంభం నుంచి ఎండ అధికమైంది. జిల్లావ్యాప్తంగా ఎక్కువ మండలాల్లో 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. ప్రతిరోజు ఇదే పరిస్థితి ఉండడంతో పలువురు వడదెబ్బ బారిన పడుతున్నారు. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తోంది. జిల్లాలో ఇటీవల పలువురు వడదెబ్బ కారణంగా మృత్యువాతపడ్డారు.

అంతటా 40 డిగ్రీలకు పైగానే...

ముదిగొండ మండలం బాణాపురంలో శనివారం అత్యధికంగా 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ప్రస్తుతం రోహిణి కార్తె కావడంతో ఎండల ప్రభావం ఎక్కువగానే ఉంది. అన్ని మండలాల్లో 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగానే ఉష్ణోగ్రతలు ఉన్నాయి. కొన్నిరోజులుగా ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి తీవ్రం కావడమే కాక వడగాలులు వీస్తున్నాయి. మరి కొన్ని రోజులపాటు ఎండలు ఇదే రీతిలో ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం 12నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడమే ఉత్తమమని చెబుతున్నారు.

జిల్లాలో శనివారం అత్యధికంగా నమోదైన ఉష్ణోగ్రతలు

మండలం	ప్రాంతం	ఉష్ణోగ్రతలు
ముదిగొండ	బాణాపురం	45
మధిర	మధిర	44.3
ముదిగొండ	పమ్మి	44.2
ఏన్కూరు	తిమ్మారావుపేట	43.9
ఖమ్మంఅర్బన్	ఖానాపురం పీఎస్	43.8
నేలకొండపల్లి	నేలకొండపల్లి	43.8
సత్తుపల్లి	సత్తుపల్లి	43.8
చింతకాని	చింతకాని	43.7
ముదిగొండ	ముదిగొండ	43.5
తిరుమలాయపాలెం	బచ్చోడు	43.4
ఖమ్మంరూరల్	పల్లెగూడెం	42.9
రఘునాథపాలెం	రఘునాథపాలెం	42.9
ఖమ్మంఅర్బన్	ఖమ్మం (ఎస్ఎస్‌పీ గెస్ట్‌హౌజ్)	42.9
మధిర	మధిర (ఏఆర్ఎస్)	42.8



ఎన్నికలప్పుడే గుర్తొస్తారా ?



పోడు రైతు భరోసా యాత్రలో పొంగులేటి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు తదితరులు

- ప్రతీ పోడు రైతుకూ పట్టా ఇవ్వాల్సిందే
- నాలుగున్నరేళ్లుగా హామీలే తప్ప ఆచరణ లేదు..
- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- కొత్తగూడెంలో భారీగా పోడు రైతు భరోసా యాత్ర



అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న పొంగులేటి తదితరులు

చుంచుపల్లి: ప్రతీ పోడు రైతుకూ పట్టా మంజూరు చేయాలని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. పోడు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం కొత్తగూడెంలోని ఇల్లెందు క్రాస్ రోడ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పోడు రైతు భరోసా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పోడు రైతుల పట్ల మొండి వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. గిరిజనులు, ఆదివాసీలు, గిరిజనేతరులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాల మంజూరులో మీన మేషాలు లెక్కించడం తగదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో గిరిజనులకు, గిరిజనేతరులకు పోడు పట్టాలు జారీ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని, నేటికీ ఏ ఒక్కరికీ పట్టా ఇవ్వలేదని, ఎన్నికల సమయంలోనే గిరిజనులు, పోడు రైతులు గుర్తొస్తారా అని ప్రశ్నించారు. 2018 ఎన్నికల సమయంలో ప్రతీ రైతుకు తానే స్వయంగా కుర్చీ వేసుకుని కూర్చుని పట్టాలిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి.. నాలుగున్నరేళ్లు దాటినా మాట నిలుపుకోలేదని విమర్శించారు. వేలాది మంది గిరిజన కుటుంబాల ఉసురుపోసుకున్నారని, పోడు రైతులను రోడ్డుపాలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆరోపించారు. సుమారు 4.41లక్షల కుటుంబాలు 13లక్షల ఎకరాల పోడు పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నాయని, అందులో 11 లక్షల ఎకరాలకు పట్టాలిస్తామని గత డిసెంబర్‌లో ప్రకటించిన కేసీఆర్ ఇప్పుడు నాలుగు లక్షల ఎకరాలకే ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. పోడు సాగు చేసుకుంటున్న గిరిజనులపై అక్రమ కేసులు బనాయించారని, వాటిని తక్షణమే ఉపసంహరించాలని అన్నారు. అర్హులైన ప్రతీ రైతుకు పట్టా ఇవ్వకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య మాట్లాడుతూ ప్రతీసారి ఎన్నికల సమయంలో మాత్రమే పోడు అంశాన్ని సీఎం తెరపైకి తెస్తున్నారని, గద్దెనెక్కాక ఆ ఊసే ఎత్తడం లేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు గిరిజనులు సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడు తూ గతంలో పోడు భూములపై ఆధారపడి జీవి స్తున్న గిరిజనులకు పిలిచి పట్టాలు ఇచ్చిన ఘనత దివంగత నేత వైఎస్.రాజశేఖరరెడ్డికే దక్కుతుందని చెప్పారు. 2014 నుంచి కేసీఆర్ పోడు సాగుదారులకు పట్టాలిస్తానని వాగ్దానాలు చేస్తూ కాలం గడుపుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, కొండూరి సుధాకర్, తుంబూరి దయాకర్‌రెడ్డి, ఊకంటి గోపాలరావు, తూము చౌదరి, ఆళ్ల మురళి, తుళ్లూరు బ్రహ్మయ్య, మువ్వ విజయబాబు, మల్లిబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పయనం



బస్సులను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్, మేయర్

ఖమ్మంస్పోర్ట్స్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) ఆధ్వర్యాన సోమవారం నుంచి హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడలకు జిల్లా క్రీడా జట్లు శనివారం బయలుదేరాయి. ఈమేరకు 14 క్రీడాంశాల్లో తలపడనున్న 220 మంది క్రీడాకారులు, కోచ్‌లు వెళ్తున్న బస్సులను ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం వద్ద అదనపు కలెక్టర్ స్నేహలత, నగర మేయర్ పునుకొల్లు నీరజ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటి అత్యధికంగా పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి, కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, ఎం.డీ.మతిన్, ఎం.డీ.షఫీక్ అహ్మద్, కె.ఆదర్శకుమార్, ఓలేటి సాంబమూర్తితో పాటు దూలం ఎరుకులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల సంరక్షణ అందరి బాధ్యత..

అదనపు కలెక్టర్ స్నేహలత



వందనం చెరువులో వ్యర్థాలను తొలగిస్తున్న అదనపు కలెక్టర్ స్నేహలత

చింతకాని: ప్రాణకోటి మనుగడకు కీలకమైన చెరువులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అదనపు కలెక్టర్ స్నేహలత తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మిషన్ లైఫ్ కార్యక్రమం ద్వారా మండలంలోని వందనం గ్రామంలో పునికి చెరువు పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈమేరకు పనులను శనివారం ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ చెరువుల్లో వ్యర్థాలు వేయడం ద్వారా జలాలు కలుషితమై జీవరాశుల మనుగడ, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. చెరువుల్లో వ్యర్థాలు, చుట్టూ పిచ్చిమొక్కలను తొలగించే కార్యక్రమంలో అందరూ భాగం కావాలని, చెరువుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా చూడాలని సూచించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించిన అదనపు కలెక్టర్ వర్షాలు కురిసే నాటికి మొక్కలను సిద్ధం చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, జిల్లా మత్స్యశాఖాధికారి ఆంజనేయస్వామి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్, సర్పంచ్‌లు కొరిపల్లి సునీత, నక్కనబోయిన సుజాత, ఏఈ సురేష్, గ్రామపంచాయతీ కార్యదర్శులు చెవుల మహేష్, ఈశ్వరాచారి, షేక్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు తరలివచ్చింది..!

మేడేపల్లిలో రెడీమేడ్ ప్రీ ఫ్యాబ్రికేటెడ్ హోం

ముదిగొండ: ముదిగొండ మండలం మేడేపల్లికి చెందిన వ్యక్తి ప్రీ ఫ్యాబ్రికేటెడ్ విధానంలో సిద్ధం చేయించిన ఇంటిని హైదరాబాద్ నుంచి కంటైనర్‌లో తీసుకొచ్చాడు. మేడేపల్లికి చెందిన పులి ఆంజనేయులు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూనే ఇలాంటి ఇళ్లను తయారు చేయించి అమ్ముతుంటాడు. ఈక్రమంలోనే తానెప్పుడైనా స్వగ్రామానికి వస్తే ఇల్లు ఉండాలనే ఉద్దేశంలో ఈ ఇంటిని శనివారం తీసుకొచ్చాడు. రెండు పడక గదులతో పాటు ఇతర వసతులు, విద్యుత్ సౌకర్యం ఉన్న ఈ ఇంటి తయారీకి రూ.5లక్షల వ్యయమైందని, ప్రస్తుతం సామగ్రి, మేస్త్రీల ఖర్చుతో పోలిస్తే ఎక్కువేం కాదని చెబుతున్నాడు. ఎక్కడికైనా తరలించుకునే వెసలుబాటు ఉన్న ఈ ఇంటిని చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరిచారు.



మేడేపల్లికి తీసుకొచ్చిన రెడీమేడ్ హోం



ఇంటి లోపలి భాగం..

క్లుప్తంగా

బీఆర్క్‌ ఫలితాల్లో హార్వెస్ట్‌ ప్రతిభ



మోహన్‌సాయిని అభినందిస్తున్న రవిమారుత్‌

ఖమ్మంసహకారనగర్‌: జేఈఈ మెయిన్స్‌ పేపర్‌–2 బీఆర్క్‌లో ఆర్కిటెక్చర్‌, బీ ప్లానింగ్‌లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని హార్వెస్ట్‌ విద్యాసంస్థల కరస్పాండెంట్‌ పి.రవిమారుత్‌, ప్రిన్సిపాల్‌ పార్వతిరెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో విద్యార్థులను అభినందించాక వారు మాట్లాడారు. బీ ప్లానింగ్‌లో ఉదారపు మోహన్‌సాయి ఆలిండియా ఏడో ర్యాంకు సాధించగా, వివిధ కేటగిరీల్లో డి.మణిదీప్‌ 49, సీహెచ్‌.మణిదీప్‌ 56, ఎల్‌.ప్రహ్లాద్‌ 166, కె.నవదీప్‌ 198, వి.కల్యాణ్‌రాం 219, ఈ.సాన్సియా 245, యు.హరదీప్‌ సాయి 316, కె.నందిని 371, ఎస్‌.ఆదిత్య ప్రణవ్‌ 582, ఎస్‌.లోకేశ్వరి 626, బి.ప్రవల్లిక 706, టి.సామ్యశ్రీ 1,593, జీఎంఎల్‌.నాగసాయి 2,146, ఎం.అన్విక 2,779, సీహెచ్‌.శ్రావణి 2,781, సీహెచ్‌.ఉపజ్ఞ 2,822వ ర్యాంకు సాధించారని తెలిపారు.

నేడు 'పొంగులేటి' ఆధ్వర్యాన ఎన్టీఆర్‌ జయంతి

ఖమ్మంమయూరిసెంటర్‌: దివంగత సీఎం ఎన్టీఆర్‌ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ సంఖ్యలో కార్లతో ర్యాలీ నిర్వహించనున్నట్లు మాజీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలోని ఎన్టీఆర్‌ సర్కిల్‌లో ఆదివారం ఉదయం మొదలయ్యే ర్యాలీలో శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం ర్యాలీగా వైరా, సత్తుపల్లి, దమ్మపేట, పాల్వంచ, మణుగూరు వెళ్లి ఎన్టీఆర్‌ విగ్రహాలకు పుష్పాభిషేకం, అన్నదానం కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

90 శాతం పూర్తయిన సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేయిస్తున్న అఫ్జల్‌హసన్‌

ఖమ్మంసహకారనగర్‌: జిల్లాలో టీఎన్జీవోస్‌ సభ్యత్వ నమోదు 90 శాతం పూర్తయిందని జిల్లా అధ్యక్షుడు షేక్‌ అఫ్జల్‌హసన్‌ తెలిపారు. కలెక్టరేట్‌లోని ట్రెజరీ కార్యాలయంలో శనివారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా అఫ్జల్‌ మాట్లాడుతూ ఉద్యోగుల సహకారంతో త్వరలోనే వంద శాతం సభ్యత్వ నమోదు పూర్తి చేస్తామన్నారు. ట్రెజరీ డీడీ వెంటపల్లి సత్యనారాయణ, ఎస్‌టీఓ వేలాద్రి, టీఎన్జీవోస్‌ నాయకులు జీఎస్‌.ప్రసాద్‌రావు, నాగులమీరా, సాయిశిరణ్మయి, యూసుఫ్‌ అహ్మద్‌, నగేశ్‌, భాస్కర్‌, వై.శ్రీనివాసరావు, కంచి శ్రీను, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో దూకిన యువకుడిని కాపాడిన పోలీసులు



యువకుడిని కాపాడిన పోలీసులు

వైరా: వైరా రిజర్వాయర్‌లో దూకిన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు స్పందించి ఆయనను కాపాడారు. వైరాకు చెందిన గోలి కృష్ణ ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. ఈమేరకు శనివారం ఉదయం వైరా రిజర్వాయర్‌ వద్దకు చేరకుని డయల్‌ 100కు ఫోన్‌ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పి రిజర్వాయర్‌లో దూకాడు. దీంతో వెంటనే స్పందించిన బ్లూకోల్ట్స్‌ పోలీసులు చేరుకుని సదరు యువకుడిని తాళ్ల సాయంతో బయటకు లాగారు. ఆర్థిక కారణాలతోనే తమ కుమారుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని కృష్ణ తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈత, తాటి చెట్లు దగ్ధం




తాటి, ఈత చెట్ల సమీపాన ఎగిసిపడుతున్న మంటలు

నేలకొండపల్లి: ఓ రైతు పొలంలో చెత్తకు అంటించిన నిప్పురవ్వలు ఎగిసిపడడంతో తాటి, ఈత చెట్లు దగ్ధమయ్యాయి. మండలంలోని కొత్తకొత్తూరు శివారులో రైతు శనివారం సాయంత్రం తన పంట పొలంలో చెత్తను తగలబెట్టేందుకు నిప్పంటించాడు. ఈదురుగాలులతో మంటలు వ్యాపించగా ఐదు తాటి, ఆరు ఈత చెట్లు మంటలకు ఆహుతయ్యాయి.

రామాలయంలో అక్రమాల పర్వం

- దేవస్థానంలో కదులుతున్న అవినీతి డొంక
- ఉద్యోగ నియామకాల్లో భారీగా అవకతవకలు
- నాదస్వర ఉద్యోగిపై తాజాగా వేటు, మరో ఇద్దరి మెడపై కత్తి!



రామాలయం వ్యూ

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో అవినీతి డొంక కదులుతోంది. ఒక్కొక్కరి అక్రమ బాగోతాలు బయటపడుతున్నాయి. పది రోజుల క్రితం అనధికారికంగా సెక్యూరిటీ విభాగంలో ఇద్దరు వ్యక్తులు పనిచేసిన విషయం వెలుగులోకి రాగా, విచారణ జరుగుతోంది. గత శుక్రవారం అవినీతి ఆరోపణలతో నాదస్వర ఉద్యోగి సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఆలయంలోని పలు విభాగాల్లో జరిగిన అవినీతి వ్యవహారంపై ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలుస్తుండగా.. సంబంధిత ఉద్యోగుల్లో కలవరం మొదలైంది.

వరుసగా వెలుగుచూస్తున్న అక్రమాలు

పది రోజుల క్రితం ఆలయ రక్షణలో అత్యంత ప్రధానంగా భావించే సెక్యూరిటీ విభాగంలో ఆలయ ఈఓకు, సదరు కాంట్రాక్టర్‌కు తెలియకుండానే ఇద్దరు వ్యక్తులు మూడు నెలలు పనిచేసిన విషయం బహిర్గతమైంది. ఆలయ రక్షణకు భంగం కలిగించే విధంగా అనధికార వ్యక్తులు అనుమతి లేకుండా ప్రవేశించారని పేర్కొంటూ ఈఓ రమాదేవి పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో దేవస్థాన కార్యాలయంలోని కీలక విభాగాల్లో పనిచేసే 'ఓ ఇద్దరు ఉద్యోగులు' పాత్ర ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. వారిని పోలీసులు కూడా విచారించినట్లు సమాచారం. విచారణ నివేదిక అందిన తర్వాత కమిషనర్‌ ఆదేశాల మేరకు ఈఓ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆలయంలో స్వామి వారి క్రతువులలో పనిచేసే నాదస్వర ఉద్యోగి ఎల్‌.కేశన్న అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురి కావడం ఆలయ ఉద్యోగుల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో ఉద్యోగుల నియామకాల్లో భారీ స్థాయిలో నగదు లావాదేవీలు నడిచినట్లు ఆధారాలు లభించటంతో కమిషనర్‌ ఆదేశాల మేరకు ఈఓ సస్పెన్షన్‌ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటనలో ఇతనితో పాటు ఇంకెవరైనా ఉన్నారా..? అనే కోణంలో విచారణ జరుగుతున్నట్లు సమాచారం.

బినామీ పేరుతో రామా నిలయం నిర్వహణ

భద్రాచలం వచ్చే భక్తుల వసతి కష్టాలు చెప్పవలనవి కావు. ఉన్న వసతి గృహాలే తక్కువ. అందులో 80 గదులకు పైగా రామాలయం సమీపంలో ఉన్న శ్రీ రామానిలయాన్ని ప్రైవేట్‌ వ్యక్తుల నిర్వహణకు అప్పగించారు. దీని వెనుక సైతం ఓ ఇద్దరు ఉద్యోగుల పాత్ర ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. పక్కనే ఉన్న 30 గదులు ఉన్న సీతానిలయాన్ని రూ.లక్షకు అద్దె ప్రాతిపదికన ఇవ్వగా, 80 గదులు ఉన్న శ్రీరామా నిలయాన్ని కేవలం రూ.90 వేలకు అప్పగించటంలో ఆ ఇద్దరు ఉద్యోగులే కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. రాజకీయ నాయకులకు, ఇతరులకు అప్పనంగా వసతి గదులను ఇవ్వాల్సి వస్తోందని, వీటిని ప్రైవేట్‌ వ్యక్తుల నిర్వహణకు ఇస్తే అద్దె వస్తోందంటూ మభ్యపెట్టగా, ఉన్నతాధికారులు నమ్మి తక్కువ అద్దెకు కట్టబెడుతూ తీర్మానం చేస్తూ సంతకాలు పెట్టారు. అయితే ఆ ఇద్దరు ఉద్యోగులే బినామీతో రామానిలయం నిర్వహణను నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై కూడా విచారణ సాగుతుండగా, అక్రమాలు ఉన్నట్లుగా తేలితే ఆ కాంట్రాక్ట్‌ను రద్దు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఆడిట్‌ అభ్యంతరాలపై నిఘా పెడితే..

రామాలయలో ప్రతిఏడాది జరిగే ఆడిట్‌లో విచారణ అధికారులు పదుల సంఖ్యలో అభ్యంతరాలు తెలుపుతున్నారు. అయినా విచారణ జరిపి, చర్యలు తీసుకున్నట్లు కనిపించదు. ఉద్యోగులు దేవస్థానంలో జరిగే పనుల కోసం ఇష్టారీతిన అడ్వాన్స్‌ తీసుకున్నట్లు సమాచారం. ఈఓ ప్రశ్నించడంతో లెక్కల చూపెట్టేందుకు కిందా మీద పడుతున్నట్లు తెలుస్తోంది. వీటిపై లోతుగా విచారణ చేపడితే అవినీతి అక్రమాలు బయటపడుతాయని పలువురు పేర్కొంటున్నారు.

ఇద్దరు ఉద్యోగులకు మెమోలు?

రామాలయం వంట స్టోర్స్‌లో పనిచేసే ఇద్దరు శాశ్వత ఉద్యోగులు అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించిన పర్యవేక్షణా కమిటీ మెమోల జారీకి సిఫార్సు చేసినట్లు సమాచారం. సదరు ఉద్యోగులకు ఆదివారం ఈఓ మెమోలు ఇవ్వనున్నట్లు తెలిసింది.

అడవిలో బైక్‌పై ఎమ్మెల్యే ప్రయాణం

రాళ్లవాగును సందర్శించిన వైరా ఎమ్మెల్యే రాములునాయక్‌



అటవీ ప్రాంతంలోకి ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఎమ్మెల్యే రాములునాయక్‌, తదితరులు

ఏన్కూరు: మారుమూల అటవీ ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై వైరా ఎమ్మెల్యే రాములునాయక్‌ ప్రయాణం చేశారు. ఏన్కూరు మండలం కాలనీనాచారంలో సుమారు ఐదు కిలోమీటర్లకు పైగా ఉన్న అటవీప్రాంతంలో రాళ్లవాగుపై చిన్న ఆనకట్ట నిర్మించాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే రాములునాయక్‌ శనివారం రాళ్లవాగును పరిశీలించేందుకు కాలనీ నాచారం వెళ్లి.. కొద్దిదూరం వాహనంలో, ఆపై ద్విచక్రవాహనంలో ప్రయాణించారు. రాళ్లవాగుపై చిన్న ఆనకట్ట నిర్మాణంతో సుమారు 1,500 ఎకరాల గిరిజనుల భూములకు సాగునీరు అందుతుందనే విషయాన్ని సీఎం కేసీఆర్‌ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆ తర్వాత మండలంలోని బురదరాఘవాపురం, తిమ్మారావుపేటల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లిన ఎమ్మెల్యే రాములునాయక్‌ సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు అందజేశారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్‌ నాయకులు, ప్రజాప్రతినిధులు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, బానోతు సురేశ్‌నాయక్‌, భూక్యా లాలు, మేడ ధర్మారావు, కట్ల సత్యనారాయణ, శివ, బాలాజీ, భూక్యా చందూలాల్‌, ఆరెం సుహాసిని, బానోతు కృష్ణప్రియ, భూక్యా శివ, వర్స రాంబాబు, వర్స మల్లేశ్వరరావు, భూక్యా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఎమ్మెల్యే చేయూత

వైరా/కొణిజర్ల: వైరా మెయిన్‌ రోడ్డు ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయానికి సమీపాన శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయాన ఏన్కూరు నుంచి వస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్‌ వెంటనే స్పందించి క్షతగాత్రుడిని తన కారులో గన్‌మెన్‌, డ్రైవర్‌ సాయంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అంతేకాక వైద్యులకు ఫోన్‌ చేసి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కాగా, ఎమ్మెల్యే రాములునాయక్‌ కొణిజర్ల మండలంలోని తనికెళ్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన నారపోగు రాయప్ప కుటుంబానికి బీఆర్‌ఎస్‌ ప్రమాద బీమా ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కు అందజేశారు. సర్పంచ్‌ సీహెచ్‌.మోహన్‌రావు, నాయకులు చిరంజీవి, రామారావు, శ్రీనివాసరావు, కృష్ణ, రవి, బాబు, రమేశ్‌, జీడయ్య, ప్రసాద్‌, విజయ్‌, కాంతి, సురేశ్‌, బాలాజీ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దీక్షకు మద్దతుగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న టీఎస్‌యూటీఎఫ్‌ నాయకులు

ఖమ్మంసహకారనగర్‌: ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి చేస్తున్న నిరాహార దీక్షకు మద్దతుగా శనివారం టీఎస్‌యూటీఎఫ్‌ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీపై హైకోర్టులో ఉన్న స్టే ఎత్తి వేయించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. అలాగే, మోడల్‌ స్కూల్‌ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ విడుదల చేయాలని, అన్ని బిల్లులను ఈ నెల 31వ తేదీలోపు విడుదల చేయాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్‌ నాయకులు షేక్‌ మహబూబ్‌ అలీ, నర్సింహారావు, బుర్రి వెంకన్న, షమీ, వల్లంకొండ రాంబాబు, రాందాస్‌, సుధాకర్‌, శ్రీను,నాగేశ్వరరావు, సతీశ్‌ పాల్గొన్నారు.

డయేరియా నియంత్రణకు చర్యలు



వైద్యశిబిరంలో పరిశీలిస్తున్న మేనేజర్‌ రమణ

ఖమ్మంఅర్బన్‌/రఘునాథపాలెం: జిల్లాలో డయేరియా నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యాక్సిన్‌ మేనేజర్‌ సీహెచ్‌ రమణ వెల్లడించారు. ఆయన శనివారం బాలాజీనగర్‌, బల్లేపల్లి, రోటరీనగర్‌, గోపాలపురం గ్రామాల్లో వైద్యశిబిరాలను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు డయేరియా నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అలాగే, రఘునాథపాలెం పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్‌ సంధ్యారాణి ఆధ్వర్యాన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యోగులు స్వాతి, సాయిరాం, రజిని, నిర్మల జ్యోతి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధం నేపథ్యాన దాడి

నేలకొండపల్లి: మండలంలోని కట్టుకాసారాం గ్రామంలో వివాహేతర సంబంధం నేపథ్యాన ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. గ్రామానికి చెందిన ఓ మహిళకు అదే గ్రామానికి చెందిన సైదులుతో వివాహేతర సంబంధం కొన్నాళ్లు కొనసాగింది. ఆ తర్వాత గొడవలు జరగడంతో సైదులును ఆమె దూరం పెట్టసాగింది. అయినప్పటికీ సైదులు కుటుంబీకులు వెంకటలక్ష్మి, సురేశ్‌, స్వాతి తదితరులు తనతోపాటు తన భర్త, బంధువులపై కూడా దాడి చేశారని సదరు మహిళ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బంగారం ఉన్న పర్సు మాయం

టేకులపల్లి: మూడు తులాల బంగారం ఉన్న పర్సు కనిపించకుండా పోయిన సంఘటన మండల కేంద్రంలో శనివారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. టేకులపల్లి మండలం రామచంద్రునిపేట గ్రామానికి చెందిన ఉమ్మగాని పద్మ శనివారం కొత్తగూడెం వెళ్లి తిరిగి వచ్చి టేకులపల్లి సెంటర్‌లో ఓ దుకాణంలో కూరగాయలు కొనుగోలు చేసింది. తన పర్సులో డబ్బులు తీసి ఇచ్చింది. కూరగాయల బ్యాగు తీసుకుని వెళ్లేటప్పుడు పర్సుతో పాటు మొబైల్‌ ఫోన్‌ని అక్కడే మరిచిపోయింది. కొంతదూరం వెళ్లాక పర్సు మరిచిపోయినట్లు గుర్తించి తిరిగి కూరగాయల షాపు వద్దకు వచ్చింది. మొబైల్‌ అక్కడే ఉంది. కానీ పర్సు మాయమైంది. పర్సులో కొంతనగదుతో పాటు మూడు తులాల బంగారు గొలుసు ఉందని బాధితురాలు వాపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రమణారెడ్డి తెలిపారు.

అంబులెన్స్‌లో ప్రసవం



పుట్టిన బిడ్డను చూపుతున్న అంబులెన్స్‌ సిబ్బంది

కూసుమంచి: మండలంలోని గైగొళ్లపల్లి పంచాయతీ శివారు చింతలతండాకు చెందిన వివాహిత దీపికకు పురిటి నొప్పులు రావటంతో శనివారం కుటుంబసభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. దీంతో 108 సిబ్బంది చేరుకుని ఆమెను ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలోనే పురిటినొప్పులు ఎక్కువ కావడంతో టెక్నీషియన్‌ శ్రీనివాస్‌, పైలట్‌ అజీముద్దీన్‌ ఆశ కార్యకర్త సహకారంతో ఆమెకు సాధారణ ప్రసవం చేశారు. దీపిక మగబిడ్డకు జన్మనివ్వగా తల్లీబిడ్డను సిబ్బంది ఖమ్మంలోని ఎంసీహెచ్‌కు తరలించారు.

సాయుధపోరాట యోధుడు రాఘవేంద్రం మృతి



రాఘవేంద్రం (ఫైల్‌)

తిరుమలాయపాలెం: తెలంగాణ సాయుధ పోరాటంలో నైజాం రజాకార్లకు ఎదురొడ్డిన ప్రముఖ స్వాతంత్య్ర సమయోధుడు, ఆయుర్వేద వైద్యుడు మండలంలోని హస్నాబాద్‌కు చెందిన సన్నాయిల రాఘవేంద్రం శనివారం మృతి చెందాడు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, తదితరులు ఆయన మృతదేహంపై ఎర్రజెండాను కప్పి నివాళులర్పించారు. కాగా, రాఘవేంద్రం స్వాతంత్య్ర సమర యోధుడిగానే కాక ఆయుర్వేద వైద్యుడిగా ఖమ్మం, నల్లగొండ, వరంగల్‌ జిల్లాల్లో పేరు సాధించారు. ఆయన కుమారుడు ఇంద్రసేన సీపీఎం నాయకుడిగా కొనసాగుతున్నారు. కాగా, సీపీఎం, ప్రజాపంథా, న్యూడెమోక్రసీ పార్టీల నాయకులు షేక్‌ బషీరుద్దీన్‌, శ్రీను, నర్సయ్య, తుల్లూరి నాగేశ్వరరావు, బింగి రమేశ్‌, నాగటి సురేశ్‌, ఆర్‌.శివలింగం, కొత్తపల్లి వెంకటరెడ్డి, పిచ్చిరెడ్డి, పసలాది వెంకన్న, వీరారెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఈత నేర్చుకునేందుకు వెళ్లి అనంతలోకాలకు..

- పండుగకు వచ్చిన కుటుంబంలో విషాదం
- బచ్చోడులో బావిలో మునిగి బాలుడు మృతి



విశాల్‌ (ఫైల్‌)



విశాల్‌ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

తిరుమలాయపాలెం: ఉపాధి కోసం ఖమ్మంలో ఉంటున్న ఆ కుటుంబం గ్రామంలో చేస్తున్న పండుగకు వచ్చి కుమారుడిని కోల్పోవడంతో తీవ్ర విషాదాన్ని నింపింది. స్నేహితులతో కలిసి ఈత నేర్చుకునేందుకు వెళ్లిన బాలుడిని మృత్యువు బలితీసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని బచ్చోడుకు చెందిన నందిపాటి ఉప్పయ్య – సుమలత దంపతులకు కుమారుడు నవీన్‌ అలియాస్‌ విశాల్‌ (14), కుమార్తె ఇందు ఉన్నారు. ఆ కుటుంబం ఉపాధి నిమిత్తం ఖమ్మం వెళ్లగా ఉప్పయ్య వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సవార్‌ లచ్చమ్మ పండుగ ఉండడంతో ఉప్పయ్య కుటుంబ సభ్యులు బచ్చోడు వచ్చారు. ఇంతలోనే శనివారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి విశాల్‌ గ్రామ శివారు ప్రాంతంలోని వ్యవయబావిలో ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. అయితే, నిండా నీరు ఉండడంతో ఈత సరిగా రాని విశాల్‌ బావిలో మునిగిపోయాడు. ఆయన స్నేహితులు గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చేసరికి గల్లంతయ్యాడు. దీంతో కూసుమంచి ఫైరింజన్‌ సిబ్బంది, స్థానిక యువకులు మోటార్ల ద్వారా నీటిని బయటకు తరలిస్తూ గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు విశాల్‌ మృతదేహం బయటపడగా ఆయన కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బావిలో జారిపడి యువకుడు..

ముదిగొండ: ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడిన ఓ యువకుడు మృతి చెందాడు. మండలంలోని గంధసిరికి చెందిన వల్లకొండ అశోక్‌ (26) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం గేదెలను మేపేందుకు గ్రామం చివర పొలాల వద్దకు వెళ్లిన ఆయన మధ్యాహ్నం తాగునీటి కోసం వ్యవసాయ బావిలోకి దిగాడు. బండపై నిల్చున్న క్రమంలో కాలుజారి బావిలో పడడంతో ఈత రాని ఆయన మునిగి చనిపోయాడు. అయితే, గేదెలను మేపుతున్న పలువురు అశోక్‌ ఇంకా రాకపోవడంతో వెళ్లిచూడగా బావిలో మృతదేహం తేలుతోంది. వెంటనే అతడి తల్లిదండ్రులకు విషయం చెప్పి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ నరేశ్‌ తెలిపారు.

కుక్క దాడిలో నలుగురికి తీవ్రగాయాలు

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. శనివారం చెన్నారంలో ఓ పిచ్చి కుక్క నలుగురిని తీవ్రంగా గాయపరచటమే కాకుండా గ్రామస్తులను పరుగులు పెట్టించింది. దీంతో వృద్ధులు, పిల్లలు ప్రాణాలను అరచేతిలో పట్టుకుని భయంతో పరుగులు తీసే క్రమాన కిందపడ్డారు. అనంతరం బాధితులకు నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఖమ్మం– పందిళ్లపల్లి స్టేషన్ల మధ్య శనివారం గుర్తుతెలియని వ్యక్తి (52) స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్‌ కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు 5.5 అడుగుల ఎత్తు ఉండగా, పొట్టపై కుడి పక్కన పుట్టుమచ్చ, తెలుపు, నలుపు ఒక్కపొడి రంగు గీతల చొక్కా, గోధుమరంగు ప్యాంట్‌ ధరించి ఉన్నాడని జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్‌ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఘటనలో ఛిద్రమైన మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్‌ చైర్మన్‌ శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలిసి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 98481 14202, 94406 27535 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ఉరి వేసుకుని మహిళ...

కామేపల్లి(కారేపల్లి): కుటుంబ కలహాల నేపథ్యాన ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కామేపల్లి మండలం నెమలిపురి గ్రామానికి చెందిన లకావత్‌ సుమలత (28)కు మహబూబాబాద్‌ జిల్లా గార్ల మండలం బీఆర్‌ఎస్‌ తండాకు చెందిన వ్యక్తితో కొన్నేళ్ల కిందట వివాహమైంది. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉండగా, మూడు రోజుల కిందట కుటుంబంలో గొడవలు జరగటంతో సుమలత నెమలిపురిలోని పుట్టింటికి వచ్చింది. అప్పటికే ఆమె తల్లిదండ్రులు దైవ దర్శనం కోసం తిరుపతి వెళ్లారు. దీంతో తన పిల్లలను తీసుకు రావాలని బంధువులను బీఆర్‌ఎస్‌ తండాకు పంపించగా పిల్లలను పంపేది లేదని భర్త చెప్పడంతో తిరిగొచ్చారు. మనస్తాపానికి గురైన సుమలత ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

చోరీకి యత్నించిన మహిళలు

కల్లూరు: కల్లూరు నూతన బస్టాండ్‌లో ఓ విద్యార్థికి చెందిన విలువైన వస్తువులు చోరీకి యత్నించిన ముగ్గురు మహిళలు.. ఆ విద్యార్థి అప్రమత్తం కావడంతో పరారయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం నగరానికి చెందిన విద్యార్థిని నితశశిప్రియ ఆర్టీసీ బస్సులో భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డి మండలం గుంపెన వెళ్తోంది. ఈ క్రమంలో కల్లూరు బస్టాండ్‌లో శనివారం సాయంత్రం 6 గంటలకు బస్సు ఆగింది. ఈ క్రమంలో నిద్రపోతున్న శశికళ వద్ద ఉన్న విలువైన వస్తువులు చోరీ చేసేందుకు ముగ్గురు మహిళలు యత్నించగా ఆమె మేల్కొని అరవడంతో సహ ప్రయాణికులు అప్రమత్తమయ్యారు. దీంతో ముగ్గురు మహిళలు పరారు కాగా, ఘటనపై ఆర్టీసీ కండక్టర్‌ మరకాల రత్నాకర్‌రావు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.రఘు తెలిపారు.